ఎట్టకేలకు రోడ్డు విస్తరణకు మోక్షం



రోడ్డు కొలతలు తీసుకుంటున్న అధికారులు, చిత్రంలో ఎమ్మెల్యే వీరేశం



అధ్వానంగా ఉన్న నకిరేకల్ పట్టణంలోని కడపర్తి రోడ్డు

- మరో వారం రోజుల్లో పనులు ప్రారంభం
- డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- తీరనున్న నకిరేకల్ ప్రజల కష్టాలు

నకిరేకల్ : ఎట్టకేలకు నకిరేకల్ పట్టణంలోని మార్కెట్-కడపర్తి రోడ్డు విస్తరణకు మార్గం సుగమం అయ్యింది. ఇరుకు రోడ్డు, వాహనాల రాకపోకల వల్ల వచ్చే దుమ్ము ధూళితో ప్రతినిత్యం ప్రజలు, దుకాణదారులు మార్కెట్-కడపర్తి రోడ్డులో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆర్అండ్బీ నల్లగొండ ఈఈ శ్రీధర్రెడ్డి, ఏఈలు సంతోష్, శ్రీకాంత్, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్తో కలిసి మార్కెట్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు పనులు మరో వారంలోగా ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. విస్తరణ పనులకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార దుకాణాదారులు, గృహస్తులు సహకరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. ప్రస్తుతం రూ.10 కోట్లు మంజూరైనందున పనులు తక్షణమే ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం నుంచి మరో రూ.8 కోట్లకు అనుమతులు రాగానే మిగతా వైఎస్సార్ కాలనీ నుంచి హైవే చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు.

గత ఏడాది శంకుస్థాపన..

నకిరేకల్లోని మార్కెట్ రోడ్డు విస్తరణ, సిరాంచ హైవే నుంచి కడపర్తి వరకు రోడ్డు మరమ్మతుల కోసం స్టేట్ ప్లాన్ నుంచి రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు గత సంవత్సరం మార్చి నెల 13వ తేదీన స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. అయితే నిధులు పూర్తిస్థాయిలో సరిపోనందున ఏడాదికాలంగా జాప్యం జరిగింది. మరో రూ.8 కోట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం రూ.10 కోట్లు మంజురు అయినందున వాటితో ఒక కిలోమీటర్ మేర పన్నాలగూడెం చౌరస్తా నుంచి వైఎస్సార్ కాలనీ వరకు 72 ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేయనున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు.

నిత్యం దుమ్ము ధూళితో అవస్థలు

నకిరేకల్-కడపర్తి రహదారిలో ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. నకిరేకల్ నుంచి శాలిగౌరారం మండలం వైపు వెళ్లే ఈ రహదారిలో 20 గ్రామాలకు చెందిన దాదాపు 10 వేల మంది నకిరేకల్కు రాకపోకలు సాగిస్తుంటారు. 200 దాకా ఆటోలు, ద్విచక్రవాహనాలు, బస్సులు నిరంతరం తిరుగుతుంటాయి. నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం మూల మలుపు నుంచి శాలిగౌరారం మండలానికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. పన్నాలగూడెం నుంచి నకిరేకల్ శివారులోని సిరాంచ బైపాస్ వరకు మూడు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతోపాటు రోడ్డు వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నది. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఈ దారి గుండా శాలిగౌరారం, మోత్కూర్, అడ్డగూడూరు, నార్కట్పల్లి మండలాల వైపు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు విస్తరణ పూర్తయితే వాహనదారుల కష్టాలు తీరనున్నాయి.

చిరకాల కల నెరవేరబోతోంది



నకిరేకల్ మార్కెట్-కడపర్తి రోడ్డు విస్తరణతో మా చిరకాల కల నెరవేరబోతోంది. మూడు కిలోమీటర్ల మేర రహదారి గుంతలమయంగా మారిన నేపథ్యంలో ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవ చూపి రూ.10 కోట్ల నిధులు మంజురు చేయించారు. పనులు పూర్తయితే వాహనదారుల కష్టాలు తీరనున్నాయి.

–చౌగోని రజిత,
మున్సిపల్ చైర్పర్సన్, నకిరేకల్

ప్రజలకు సేవ చేసేవారినే గెలిపించండి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్రెడ్డి

గట్టుప్పల్ : నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ నిబద్ధతతో పనిచేసే వాళ్లే సర్పంచులుగా, ఎంపీటీసీలుగా పోటీ చేయాలని, ప్రజలు అలాంటి వాళ్లనే గెలిపించుకోవాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి అన్నారు. మార్నింగ్ వాకింగ్లో భాగంగా ఆదివారం గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామంలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇళ్లు రాని అర్హులైన నిరుపేదలకు రెండో జాబితాలో ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. కాయకష్టం చేసుకుంటూ గుడిసెలో జీవిస్తున్న రాములు ఇంటికి వెళ్లి పరిశీలించి చలించి పోయి, ఇల్లు కట్టిస్తానని మాటిచ్చారు. విద్యుత్ లూజు లైన్స్, గృహాల మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్లను వెంటనే తొలగించాలని విద్యుత్ ఏఈని ఆదేశించారు. అంతంపేట నుంచి దేవులతండా, రాజ్యతండాకు కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు, నామాపురం గ్రామానికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో వీరమళ్ల శ్రీశైలం, రావుల రమేష్, దాసరి ఐలయ్య, మాదగాని వెంకటయ్య, పంతంగి యాదయ్య, మాదగాని శేఖర్, తోకల యాదయ్య, జలేందర్ పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మునుగోడు: గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మునుగోడులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తమకు మంచి నీటి సమస్య ఉందని, రుచికరంగా భోజనాలు వండిపెట్టడం లేదని ఎమ్మెల్యేకు విద్యార్థినులు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. విద్యార్థినులకు రుచికరంగా భోజనం వండి పెట్టాలని, మరోమారు విద్యార్థుల నుంచి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఏఈకి సూచించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్రెడ్డి తదితరులు ఉన్నారు.



మునుగోడు: విద్యార్థినులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్రెడ్డి



గట్టుప్పల్ : అంతంపేట గ్రామంలో ఎమ్మెల్యే రాజగోపాల్రెడ్డికి సమస్యలు వివరిస్తున్న మహిళ

క్లుప్తంగా

పాల సంఘం చైర్మన్ల ఎన్నిక

చిట్యాల: మండలంలోని చిట్యాల, తాళ్లవెల్లెంల, ఆరెగూడెం, వెంబాయి గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్లను ఆదివారం ఎన్నుకున్నారు. చిట్యాల పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్గా జిట్ట రవి, తాళ్లవెల్లెంల గ్రామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడిగా బత్తుల ప్రవీణ్, డైరెక్టర్లుగా నకిరేకంటి చిన్న అంజయ్య, జనగాం అంజయ్యలు ఎన్నికయ్యారు. ఆరెగూడెం మహిళ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్పర్సన్గా నాగులగాని అండమ్మ, డైరెక్టర్లుగా కొలను యాదమ్మ, సామిడి సత్తమ్మ ఎన్నికయ్యారు. వెంబావి పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్గా నక్క శ్రీశైలం యాదవ్ ఎన్నికయ్యారు.

మర్రిగూడ చైర్మన్గా శ్రీనివాస్రెడ్డి

మర్రిగూడ: మండల కేంద్రంలోని పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్గా మోదుగు శ్రీనివాస్రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆయా పాల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల్లో ఎన్నికైన పది మంది డైరెక్టర్లు కలిసి సొసైటీ చైర్మన్ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాండు, వెంకటయ్య, నరసింహ, రమేష్, శ్రీరాములు, గణేష్, రాజు పాల్గొన్నారు.

వృద్ధురాలికి చేయూత



వృద్ధురాలు ధనమ్మతో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్ : లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు మానవత్వం చాటుకున్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పెద్ద మండవకి చెందిన 85 ఏళ్ల ధనమ్మ అనే వృద్ధురాలు పేదరికంతో ఇబ్బందులు పడుతోంది. ఆదివారం ఆ వృద్ధురాలికి నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్, వంగూరి వినయ్, పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని బొడ్రాయికి పూజలు



బొడ్రాయికి నీళ్లు పోస్తున్న మహిళలు

నార్కట్పల్లి : వర్షాలు కురవాలని కోరుకుంటూ ఆదివారం మండలంలోని మాండ్ర గ్రామంలో మహిళలు బొడ్రాయికి పూజలు చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకునానరు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొండ సౌమ్య, సరోజన, శైలజ, అండాలు, జ్యోతి, రేణుక , గ్రామసులు తదితరులు ఉన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

మునుగోడు: వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ ఆదివారం మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలోని గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. డప్పు చప్పుళ్లతో మహిళలు తమ ఇళ్ల నుంచి నీళ్ల బిందెలతో ఊరేగింపుగా వెళ్లి దేవతలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామనర్సింహారెడ్డికి నివాళి

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన కర్నాటి రామనర్సింహారెడ్డి(47) గుండెపోటులో శనివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, స్టేట్ డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్రెడ్డి, మదర్ డైరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్రెడ్డిలు వేర్వేరుగా సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్రెడ్డి, నాయకులు నర్రా మోహన్రెడ్డి, జడల చినమల్లయ్య, వనమా వెంకటేశ్వర్లు, కట్టంగూరి మల్లేష్, ఏళ్ల వెంకట్రెడ్డి, కోన్రెడ్డి మహిపాల్రెడ్డి, మేడి నర్సింహ తదితరులు నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ పరామర్శ

మునుగోడు: మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారి తిరందాసు సత్తయ్య అనారోగ్యానికి గురై నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆదివారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆస్పత్రికి వెళ్లి సత్తయ్యను పరామర్శించారు. సత్తయ్య ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సత్తయ్య వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా సహకరిస్తానని తెలిపారు. ఆయన వెంట తిరిపారి వెంకటేశ్వర్లు, తిరందాసు శ్రీనివాసులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతితోపాటు 7, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి ఆదివారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు నేరుగా పాఠశాలలో సంబంధిత ధ్రువపత్రాలతో సంప్రదించాలని కోరారు.

క్రీడా పాలసీని అమలు చేస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా క్రీడా పాలసీని రూపొందించి అమలు చేయనున్నదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్షిప్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన చిట్యాల పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులను ఆదివారం నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ చాంపియన్షిప్లో అండర్-27 బాలుర సబ్ జూనియర్ విభాగంలో చికిలంమెట్ల సాహిత్ స్వర్ణ పతకం, అండర్-47 విభాగంలో భీమిరెడ్డి జ్ఞానకౌశిక్రెడ్డి, అండర్-52 విభాగంలో ఓర్సు ధావన్, అండర్-29 బాలికల క్యాడిట్ విభాగంలో సిరసనవాడ సాయిప్రియ స్వర్ణ పతకాలు సాధించారు. అండర్-38 బాలికల విభాగంలో కాచం హన్విత, అండర్-32 బాలికల క్యాడిట్ భీమిరెడ్డి మహాన్యా రజత పతకాలు సాధించారు. అండర్-57 విభాగంలో మూడ సాయి గణేశ్, అండర్-53 విభాగంలో మూడ సాయి శ్రీనివాస్ రజత పతకాలు సాధించారు. అండర్-29 విభాగంలో గరిషే విష్ణువర్ధన్, అండర్-25 విభాగంలో కాచం రుత్విక్, అండర్-33 విభాగంలో పోలస ఉత్తమ్కుమార్ కాంస్య పతకాలు సాధించారు. వీరితోపాటు మాస్టర్ పట్టిడ సుధాకర్, కోచ్ పణింద్రకుమార్లను ఎమ్మెల్యే అభినందించారు.



తైక్వాండో క్రీడాకారులతో ఎమ్మెల్యే వీరేశం

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

నల్లగొండ టూటౌన్: క్రెడాయి నల్లగొండ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ సేవా కార్యక్రమాల్లో కార్యవర్గమంతా భాగస్వాములు కావాలని క్రెడాయి నల్లగొండ అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని క్రెడాయి కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రెడాయి సభ్యులందరినీ భాగస్వాములను చేస్తూ మొక్కలు నాటడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడానికి తీర్మానించినట్లు తెలిపారు. డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. జూలై 13న క్రెడాయి నల్లగొండ చాప్టర్ సర్వసభ్య సమావేశం నిర్వహించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో క్రెడాయి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బండారు ప్రసాద్, సెక్రటరీ ఆమంచి రాజలింగం, కోశాధికారి మనోహర్, ఏచూరి భాస్కర్, దూదిపాల వెంకట్రెడ్డి, ఆవుల శ్రీనివాస్, పవన్కుమార్, బొడ్డుపల్లి సతీష్, సముద్రాల శ్రీనివాస్, ఎదుల్ల శ్రీధర్రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటా



నగదు అందిస్తున్న కుంభం శ్రీనివాస్రెడ్డి

మునుగోడు: పేద కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉండి వారికి సహాయ సహకారాలు అందిస్తానని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన నిరుపేద రావుల వెంకటమ్మ నూతన ఇంటి నిర్మాణానికి కుంభం శ్రీనివాస్రెడ్డి ఆదివారం రూ.40వేల ఆర్థిక సహాయం అందజేశారు. అంతకు ముందు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్రెడ్డి స్ఫూర్తితో పేదలకు తన వంతుగా, అదేవిధంగా ప్రభుత్వ పరంగా సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, మాజీ సర్పంచ్ పగిళ్ల భిక్షం, మాజీ ఉప సర్పంచ్ కుంభం యాదగిరిరెడ్డి, బొందు రవి, ఇరుగుదిండ్ల భిక్షం, మేక మధుసూదన్రెడ్డి, మేక భిక్షం రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, ఆన్లైన్ బెట్టింగ్లను అరికట్టాలి



మాట్లాడుతున్న మల్లం మహేష్

చిట్యాల: యువత పెడదారి పట్టేందుకు కారణమవుతున్న డ్రగ్స్, ఆన్లైన్ బెట్టింగ్ యాప్ల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ డిమాండ్ చేశారు. చిట్యాలలో ఆదివారం జరిగిన డీవైఎఫ్ఐ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక ప్రభుత్వ ప్రోత్సాహకం అందక వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. యువకులకు తగిన జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం తగిన పాలసీ రూపొందించి అమలు చేయాలని కోరారు. పంది నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు వడ్డగాని మహేష్, ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్, సహాయ కార్యదర్శి కూనూరు గణేశ్, అవిశెట్టి మహేష్, భరత్, మనోజ్, వివేక్, మనోజ్కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

మునుగోడు: పుట్టి పెరిగిన గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్గౌడ్ కోరారు. మునుగోడు మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన ఉద్యోగులు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఆదివారం విద్యార్థులకు టై, బెల్టు, షూలతోపాటు ఇతర వస్తువులను శ్రీనివాస్గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం శ్రీనివాస్గౌడ్ మాట్లాడుతూ కోతులారం ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు పాఠశాల అభివృద్ధికి ముందుకురావడం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లేషం, ఎస్ఐ ఇరుగు రవి, కోతులారం గ్రామ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కందుల జగదీశ్వర్గౌడ్, గుజ్జ ప్రవీణ్, కమటాల ప్రశాంత్, బంగారు చందు, కందుల రవికుమార్, జల శ్రీను, నర్సింహ, సైదులు, శంకర్, శివ, లింగస్వామి పాల్గొన్నారు.



దాతలకు జ్ఞాపికలు అందజేస్తున్న శ్రీనివాస్ గౌడ్

నాడు నాటారు.. నేడు నరికారు



తిప్పర్తిలో హైవే వెంట నరికివేసిన హరితహారం చెట్లు

తిప్పర్తి : రాష్ట్రంలో అడవుల శాతం పెంచేందుకు ఖాళీ ప్రదేశాల్లో రోడ్ల వెంట ప్రభుత్వం విరివిగా మొక్కలు నాటిస్తోంది. అయితే గతంలో అధికారులు మొక్కలను ఓ ప్రణాళిక లేకుండా విద్యుత్ స్తంభాల వెంట నాటించారు. అవి ప్రస్తుతం పెద్దవి అయ్యి విద్యుత్ తీగలకు తాకుతున్నాయి. దీంతో విద్యుత్ శాఖ అధికారులు చెట్లను నరికివేస్తున్నారు. తిప్పర్తి మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డు వెంట ఏపుగా పెరిగిన చెట్లను నరికివేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు ప్రణాళిక ప్రకారం నాటినట్లయితే ఇప్పుడు నరికే అవసరం ఉండదు కదా అని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వనమహోత్సవంలో మొక్కలను ప్రణాళిక ప్రకారం నాటించాలని కోరుతున్నారు.

ప్రపంచంలోనే భారత రాజ్యాంగం గొప్పది



మాట్లాడుతున్న పాశం నరేష్రెడ్డి

నల్లగొండ టౌన్: ప్రపంచంలోనే భారత రాజ్యాంగం గొప్పదని ప్రజాస్వామ్య పరిరక్షణ సేవా సమితి కన్వీనర్, న్యాయవాది పాశం నరేష్రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లారు. రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలు బానిసలుగా బతకాల్సిన రోజులు వస్తాయన్నారు. సనాతన ధర్మం అంటూ మనిషిని మనిషిగా చూడని మనుధర్మాన్ని అమల్లోకి తెచ్చే కుట్ర జరుగుతోందన్నారు. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో తిప్పర్తి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గాదె లింగస్వామి, వంటిపాక యాదగిరి, కత్తుల జగన్కుమార్, కె.పర్వతాలు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్రెడ్డి, ఎండీ కుతుబుద్దీన్, పందుల సైదులు, కొండ లలితక్క, ఎండి రఫీ, వెంకులు, షరీఫుద్దీన్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

నల్లగొండ టౌన్: కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సింగ్ కేడర్కు ప్రమోషన్స్ కల్పించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియుద్దీన్, యాదానాయక్ మాట్లాడుతూ జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా తుమ్మల వీరారెడ్డి, అధ్యక్షుడిగా పులికంటి భాస్కర్, అసోసియేట్ అధ్యక్షురాలిగా పి.ప్రమీల, వర్కింగ్ ప్రెసిడెంట్గా నరేష్కుమార్, ప్రధాన కార్యదర్శిగా వల్లపుదాసు భూలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.పద్మ, కోశాధికారిగా గోవింద రెడ్డి, ఉపాధ్యక్షులుగా సరిత, నాగరాజు, ప్రవీణ్లు, సహాయ కార్యదర్శులుగా లింగస్వామి, సుజాత సురేష్, కమిటీ సభ్యులుగా రాధాకుమారి, నాగేందర్, అనిత, పద్మ, నాగమణి, స్వామి, రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో కదారి బలరాం, దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, లకపాక రాజు, గిరి యాదయ్య, సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులు లేక మూతబడుతున్న పాఠశాలలు

- బడిబాట నిర్వహించినా ఫలితం అంతంత మాత్రమే
- ప్రైవేట్ పాఠశాలలకే మొగ్గు చూపుతున్న విద్యార్థులు
- శేరిగూడెం పాఠశాల మూసివేతకు అధికారుల నిర్ణయం !



విద్యార్థులు రాకపోవడంతో మూసివేసేందుకు సిద్ధమవుతున్న శేరిగూడెం పాఠశాల

గట్టుప్పల్ : ఆనాడు విద్యార్థులతో కలకలలాడిన ప్రభుత్వ బడులు నేడు ఒక్కొక్కటిగా మూతబడుతూ వస్తున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతి ఏడాది బడి బాట కార్యక్రమం నిర్వహిస్తూనే ఉన్నా విద్యార్థుల సంఖ్య మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అనేక కుటుంబాలు పల్లెల్లో పనులు లేక పట్నం బాట పట్టగా.. ఊరిలో వ్యవసాయం, కూలి పనులు చేస్తూ జీవనం గడుపుతున్న కుటుంబాలకు చెందిన పిల్లలు సైతం మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారు. గట్టుప్పల్ మండల వ్యాప్తంగా ఇప్పటికే మూడు తండాల్లో మూడు బడులు మూత పడగా.. తాజాగా శేరిగూడెం ప్రాథమిక పాఠశాల సైతం విద్యార్థులు లేకపోవడంతో మూసివేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

కౌన్సిలింగ్ ఇచ్చినా..

శేరిగూడెం గ్రామంలో కొన్ని కుటుంబాలు హైదరాబాద్కు వలస వెళ్లగా.. ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలు సైతం గట్టుప్పల్ మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు నిత్యం విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి ఎంత బతిమిలాడినా పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించడం లేదు. ఇటీవల మండల విద్యాధికారి అమృతాదేవి సైతం ఊరిలో తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటే తప్ప శేరిగూడెం బడి మూతపడడం ఖాయం.

గ్రామస్తుల సహకారం ఉండాలి



నాణ్యమైన విద్య పొందాలంటే ప్రభుత్వ బడులకే పిల్లలను పంపించాలి. గ్రామస్తుల సహకారం ఉంటే తప్పకుండా ప్రభుత్వ బడులు ముందుకు సాగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా రెండు జతల యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు అందిస్తున్నాం. ఉన్న ఊరిలో చదువుకోవడం ఎంతో మంచిది. శేరిగూడెం గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపించాలి.

– అమృతాదేవి, గట్టుప్పల ఎంఈఓ

కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్గౌడ్

చండూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని చండూరు మున్సిపల్ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్గౌడ్, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ గంట సత్యం అన్నారు. ఆదివారం చండూరులో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసి, నిత్యం ప్రజల్లో ఉండేవారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్రెడ్డి సహకారంతో చండూరును అభివృద్ధి చేస్తామని, వార్డుల వారీగా సమస్యలు తెలుసుకుని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలిసి మెలిసి పనిచేసి మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ నాయకులు దోటి వెంకటేశ్, కోడి శ్రీనివాసులు, కలిమికొండ జనార్దన్, నల్లగంటి మల్లేష్, మంచుకొండ సంజయ్, కారింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.